సాక్షి
బాపట్ల
సోమవారం। 11। ఆగస్టు। 2025



పోలేరమ్మ బోనాల ఉత్సవం

కారెంపూడి: బట్టువారిపల్లెలో పోలేరమ్మ బోనాల ఉత్సవం ఘనంగా జరిగింది. మహిళలు ఆదివారం ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి, పోతురాజుకు నైవేద్యం సమర్పించారు.



పార్వతీదేవికి పూజలు

అమృతలూరు(భట్టిప్రోలు): గోవాడలోని బాల కోటేశ్వరస్వామి దేవాలయంలో పార్వతీదేవికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

ప్రత్యేక అలంకరణలో గంగమ్మ



పిడుగురాళ్ల: పట్టణం లోని గంగమ్మ తల్లిని ఆదివారం పూలతో ప్రత్యేకంగా అలంక రించారు. భక్తులు అమ్మవారిని దర్శించు కొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

న్యూస్‌రీల్

హోరాహోరీగా అథ్లెటిక్స్ పోటీలు



చీరాల: అంతర్ జిల్లాల 36వ అథ్లెటిక్స్ చాంపి యన్ షిప్ పోటీలు స్థానిక వీఆర్ఎస్‌వైఆర్ఎస్ కళాశాలలో హోరాహోరీగా జరుగుతున్నాయి. బాపట్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో ఆదివారం జరిగిన పోటీల్లో 1500 మంది బాలబాలికలు పాల్గొన్నారు. చీరాలలో మొదటిసారిగా రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీ లను నిర్వహించడంతో తిలకించేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు హాజరయ్యారు. బాపట్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, ఆర్గనైజింగ్ కమిటీ తరఫున అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో వసతుల కల్పనకు కృషి




తెనాలిఅర్బన్: ఆర్టీసీ డిపోలో ప్రయాణికులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. తెనాలి ఆర్టీసీ డిపోను ఆదివారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రయాణికులతో మాట్లాడారు. ఈ నెల 15 నుంచి స్త్రీశక్తి పేరుతో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. విజయవాడకు 19, గుంటూరుకు 34 సర్వీసులను మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి ఆకస్మిక తనిఖీ




తెనాలి: కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికే షన్ శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ ఆదివారం తెనాలిలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పచ్చ కామెర్లకు చికిత్స తీసుకుంటున్న రోగితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనం తరం విలేకరులతో మాట్లాడుతూ 30–40 మంది రోగులతో మాట్లాడానని, వారంతా ఆసుపత్రిలో వైద్యసేవలతో సంతృప్తి వ్యక్తం చేశారని మంత్రి చెప్పారు. రోగనిర్ధారణకు వినియోగించే సీటీ స్కాన్ చెడిపోయి చాలా కాలమైనా కొత్త పరికరం ఏర్పాటు చేయకపో వటం తన దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకుంటానని చెప్పారు.

ఘనంగా దివ్యబలిపూజ



విజయపురి సౌత్: ప్రతి ఒక్కరూ దేవునిపై విశ్వాసంతో జీవించాలని సాగర్‌మాత ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసెఫ్ బాల సాగర్ ఉద్బోధించారు. ఆదివారం సాగర్‌మాత దేవాలయంలో జరిగిన దివ్యబలిపూజ కార్యక్ర మంలో ఆయన భక్తులనుద్దేశించి ప్రసంగిం చారు. తోటివారిని ప్రేమించటం క్రైస్తవ్యంలో ప్రధానమన్నారు. ఏసుక్రీస్తు చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. ఏసు ప్రభువును ఈ ప్రపంచానికి అందించిన దివ్య మూర్తి మేరిమాత అని కొనియాడారు. అనం తరం దేవాలయ ప్రాంగణంలో జరిగిన తేరు ప్రదక్షిణలో భక్తులు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయానికి విరాళాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్ర కీలా ద్రిపై ఉన్న కనక దుర్గమ్మ ఆలయానికి ఆదివారం పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. నెల్లూరు జిల్లా వెంకటగిరికి చెందిన శీల రమ్య కుటుంబం అమ్మవారి నిత్యాన్నదాన పథకానికి రూ. 5,01,116 విరాళాన్ని ఆలయ అధికారులకు ఇచ్చారు. గుంటూరు పట్టాభిపురానికి చెందిన విజయ్ శైలేంద్ర అమ్మవారి ఉచిత ప్రసాద పంపి ణీకి రూ. 90 వేలు విరాళాన్ని అందజేశారు. డోనర్ సెల్‌కు రూ.10 వేల విలువైన బీరువాను అందించారు. తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్‌కు చెందిన బాలా ప్రగడ ఎస్ఎస్ కామేశ్వరి కుటుం బం దుర్గగుడి అభివృద్ధి పనులకు రూ.1,07,900 విరాళాన్ని అందజేసింది.

ఉచితం సరే.. అసలు బస్సే లేదే!

బల్లికురవ పరిధిలోని పలు ప్రాంతాలకు బస్సు వసతి లేక ప్రజలకు కష్టాలు

- ఆర్టీసీ బస్సుల కొరతతో జనం పాట్లు
- బల్లికురవ బస్టాండ్‌లో వ్యర్థాలతో దుర్గంధం
- కనీస ఆలనాపాలన లేక వెలవెల
- 'ఉచిత' పథకం సమయానికైనా బస్సులు నడపాలని డిమాండ్
- ప్రయివేట్ వాహనాలతో తరచూ చోటుచేసుకుంటున్న ప్రమాదాలు

ఎన్నికలకు ముందు నుంచీ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమని చంద్రబాబు ఊరిస్తూనే ఉన్నారు. ఇప్పుడు ఆగస్టు 15వ తేదీ నుంచి అమలు చేస్తామన్నారు. ఆ పథకం అమలు సంగతేమోగానీ.. మా ఊళ్లకు కనీసం బస్సు నడిస్తే చాలని బల్లికువర పరిధిలోని ప్రజలు వాపోతున్నారు. అలాగే స్థానిక బస్టాండును పునరుద్ధరించి తమ ఇబ్బందులు తీర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

బల్లికురవ: సుమారు రెండు దశాబ్దాల క్రితం వరకు వందలాది బస్సులతో కళకళలాడిన బస్టాండ్ నేడు బస్సుల రద్దుతో ఆలనాపాలన లేక జీర్ణావస్థతో వెలవెలబోతుంది. వ్యర్థాల కుప్పలకు బస్టాండ్ ఆవరణం నిలయంగా మారుతోంది. ప్రభుత్వం నాలుగు దశాబ్దాల క్రితం బల్లికురవకు నాలుగు రోడ్ల కూడలికి సమీపంలో బస్టాండ్‌ను నిర్మించింది. రెండు దశాబ్దాల పాటు అద్దంకి, నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ, చీరాల డిపోలకు చెం దిన బస్సులు వివిధ రూట్లలో తిరిగేవి. అద్దంకి డిపో పరిధిలో ఉన్న ఈ బస్టాండ్‌కు ఓ కంట్రోలర్‌ను నియమించారు. అన్ని డిపోల బస్సులు లోనికి వచ్చి వెళ్లేవి. ప్రయాణికులు ఇక్కడే బస్సుల రాక కోసం నిరీక్షించేవారు. 2005లో కంట్రోలర్ ఉద్యోగ విరమణ తర్వాత కొత్త వారిని నియమించలేదు. క్రమేపీ బస్సుల సంఖ్య తగ్గటంతోపాటు చీరాల, నరసరావుపేట, వినుకొండ డిపోల నుంచి బస్సులు పూర్తిగా రద్దు చేశారు.

ప్రయివేటు వాహనాల హవా..

5 డిపోలకు సంబంధించి 20 బస్సులకుపైగా రెం డు దశాబ్దాల క్రితం వరకు వివిధ రూట్లలో తిరిగేవి. నేడు చిలకలూరిపేట డిపో నుంచి కుందుర్రుకు రోజుకు 4 ట్రిప్పులు, అద్దంకి డిపో నుంచి గొవాడ బల్లికురవ మీదుగా చిలకలూరిపేటకు 3 ట్రిప్పు లు.. అద్దంకి డిపో నుంచి వైదన, బల్లికురవ మీదుగా చిలకలూరి పేటకు ఒక ట్రిప్పుతో 4 బస్సులు మాత్రమే నడుస్తున్నాయి. ప్రధాన గ్రామా లైన ఉప్పుమాగులూరు, వేమవరం, కొత్తూరు, వెల మవారిపాలెం, కోటావారి పాలెం, సోమవర ప్పాడు, జమ్ముల మడక కాలనీలకు బస్సు వసతి లేదు. మండలం, నియోజకవర్గం జిల్లా కేంద్రాలకు వెళ్లాలంటే వీరి అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. కనీసం వైద్యానికి వెళ్లాలన్నా వ్యయప్రయాసలతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రయివేట్ వాహనాలు, ఆటోలను ఆశ్రయిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు.



బస్టాండ్ ముందు పేరుకుపోయిన వ్యర్థాలు



బస్సుల కొరతతో ప్రమాదభరితంగా ప్రయాణం

కుప్పలుగా చెత్త

స్థానిక నాలుగురోడ్ల కూడలిలోని వ్యాపారులు వ్యర్థాలను బస్టాండ్ ఆవరణలోనే పడేయడంతో ఇటీవల వర్షాలకు కుళ్లి దుర్గంధాన్ని వెదజల్లుతు న్నాయి. వ్యర్థాల కుప్పలు వేయడంతో పందులు సంచారం అధికమైంది. రెండు దశాబ్దాలు విని యోగంలో లేనందున టాయిలెట్స్, బస్టాండ్ ఆవ రణ దెబ్బతిన్నాయి. ఈ పరిస్థితులకు తోడు విద్యుత్ శాఖకు బిల్లు చెల్లించనందున సరఫరా నిలుపుదలతో అసాంఘిక కార్యకలాపాలకు నిల యమైంది. రూ.లక్షలు ఖర్చుతో నిర్మించిన భవ నాలు జీర్ణావస్థకు చేరడంతో స్థల దాతలు అస హనం వ్యక్తం చేస్తున్నారు.

బస్సు వసతి కల్పించండి



మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాలకు మేము వెళ్లేందుకు మాకు ఆర్టీసీ బస్సు వసతి కల్పించాలి. ప్రస్తుతం చిలకలూరిపేట డిపో నుంచి పాఠశాల, కళాశాల విద్యార్థులకు బస్సు రావటం లేదు. అద్దంకి డిపో నుంచి బల్లికురవ, ఉప్పుమాగు లూరు మీదుగా చిలకలూరిపేటకు, చిలకలూ రిపేట నుంచి అద్దంకికి బస్సులు నడపాలి.

– కొండవర్తి చెంచులక్ష్మి , సోమవరప్పాడు

బస్టాండుకు పూర్వ వైభవం తేవాలి



చిలకలూరిపేట, నరసరా వుపేట, వినకొండ, చీరాల, అద్దంకి డిపోల నుంచి బల్లి కురవ మండలంలో గతం లో తిరిగిన బస్సులు పున రుద్ధరించాలి. బస్సుల రద్దుతో ఇబ్బందులు పడుతున్నాం. బస్టాండ్‌ను అభివృద్ధి చేయాలి.

– ఆవుల కోటేశ్వరరావు, బల్లికురవ

బస్సులు నడపాలని మంత్రికి విన్నపం

కూటమి ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పిస్తామని ప్రకటి స్తోంది. బస్సులు లేకుండా తాము ప్రయాణం ఎలా చేయాలంటూ మహిళలు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని 21 పంచాయతీలలోని 14 శివారు గ్రామాల్లో 13 గ్రామా లకు బస్సు వసతి లేదు. ఇటీవల ముక్తేశ్వరం గ్రామానికి వచ్చిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఈ విషయం తెలిపారు. బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నామని, అన్ని రూట్లలో గతంలో రద్దు చేసిన బస్సులను పునరుద్ధరించాలని ప్రజలు విన్నవించారు.



బద్దీకొట్ల ముందు ఆగిన బస్సు

నాగార్జునకొండను సందర్శించిన శ్రీలంక బౌద్ధుల బృందం



విజయపురిసౌత్: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండను ఆదివారం శ్రీలంక దేశానికి చెందిన 45 మంది బౌద్ధుల బృందం సందర్శిం చింది. వీరు నాగసిరి లాంచీలో నాగార్జున కొం డకు చేరుకొని కొండలోని మ్యూజియంలో ఉన్న 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, బుద్ధుని పుట్టుకకు సంబంధించిన శిలా ఫలకాలు, రాతి పనిముట్లు, సింహళ విహా ర్‌లోని మహాస్తూపం, అశ్వమేధ యాగశాల, స్నానఘట్టం తిలకించి బౌద్ధ గురువు దలైలామా నాటిన బోధి వృక్షం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పచ్చని కొండల మధ్య ఉన్న అనుపు, యాంపీ స్టేడియం, 60 అడుగుల ఎత్తు నుంచి జాలువారే ఎత్తిపోతల జలపాతాన్ని తిల కించారు. పర్యాటకులు లాంచీలలో నాగార్జున కొండ వెళ్లటంతో పర్యాటక శాఖకు 72 వేల రూపాయల ఆదాయం చేకూరినట్లు అధికారులు తెలిపారు.

లాంచీ స్టేషన్‌ను సందర్శించిన జీఎం



విజయపురిసౌత్: పర్యాటక శాఖ జీఎం చందన నాంచారయ్య ఆదివారం లాంచీస్టేషన్‌ను పరిశీ లించారు. మరమ్మతులకు గురైన లాంచీని రెం డు రోజుల్లో అందుబాటులోకి తీసుకువస్తామ న్నారు. పర్యాటకులకు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. హరిత రిసార్ట్స్ ఉద్యోగులకు సూచ నలు చేశారు. లాంచీ యూనిట్ మేనేజర్ వినయ తుల్లా, విజయవాడ అసిస్టెంట్ మేనేజర్ రవికుమార్, రిసార్ట్స్ మేనేజర్ మస్తాన్ రావు, పులుసు వీరారెడ్డి తదితరులు ఉన్నారు.

బౌద్ధస్తూపం పరిరక్షణకు చర్యలేవీ?

- ఎంతో విశిష్టత కలిగిన భట్టిప్రోలు బౌద్ధ ఆరామం
- అధికారుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచుకుని పర్యాటక ప్రాంతం
- సందర్శకులకు కనీస వసతులు కూడా లేక ఇబ్బందులు

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని అతి ప్రాచీన బౌద్ధ స్తూపం సరైన ఆలనాపాలన లేకుండా నిరాదరణకు గురవుతోంది. బుద్ధుని అస్థికలపై ఏర్పాటు చేసిన ఈ స్తూపంపై చాలామంది కాలక్షేపం చేస్తున్నారు. మరికొందరు ఆటలాడుతున్నారు. దాదాపు 3 వేల సంవత్సరాల క్రితం భట్టిప్రోలు వాణిజ్య, విద్యా కేం ద్రంగా విరాజిల్లింది. రాష్ట్రంలోని అన్ని బౌద్ధ స్తూపా ల్లోకెల్లా ఇది అతి పురాతనమైనది.

మౌలిక వసతులు కరువు

బౌద్ధస్తూపం అభివృద్ధి పనులు ఎలా ఉన్నా.. దీనిని వీక్షించేందుకు వస్తున్న పర్యాటకులకు కనీస సౌక ర్యాలు కూడా లేవు. స్తూపం ముందు భాగంలో గార్డెనింగ్‌పై దృష్టి సారించిన పురావస్తు, ఆర్కి యాలజీ శాఖాధికారులు వసతుల కల్పన విష యాన్ని విస్మరించడం శోచనీయం. ఇంత వరకు అండర్ పోర్షన్ మాత్రమే పూర్తయింది.

శిలాఫలకానికే పరిమితం

బౌద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని టీడీపీ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే కార్యక్రమం లో భాగంగా భట్టిప్రోలును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు 2016 మే 19న శ్రీకారం చుట్టింది. స్తూపం ఆవరణలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృ ద్ధి సంస్థ (జేతవనం ప్రాజెక్ట్) ఆధ్వర్యంలో రూ.60 లక్షలతో 40 అడుగుల ఎత్తైన బుద్ధుని విగ్రహం, బోటు షికారు, తదితర అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాటు చేసిన శిలాఫలకం అలానే ఉంది. పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి.



భట్టిప్రోలు బౌద్ధస్తూపం



స్తూపంపై ఆటలాడుతున్న సందర్శకులు

పాముల సంచారంతో భయం

బౌద్ధక్షేత్రం తిలకించేందుకు పర్యాటకులు వచ్చిన ప్పుడు పాములు కనిపించడంతో పరుగులు తీస్తున్న ఘటనలు జరుగుతున్నాయి. ఈ క్షేత్రం నిర్వాహణపై అధికారుల పట్టింపు కరువైంది. ఆవరణ అంతా పిచ్చి గడ్డి పెరిగింది. వర్షం కురిస్తే ఆవరణలో భారీగా నీరు నిల్వ ఉంటోంది.

డిగ్రీ అడ్మిషన్ల కోసం పడిగాపులు

- నాలుగు నెలల కిందట ఇంటర్ ఫలితాల విడుదల
- ఇప్పటి వరకు డిగ్రీ ప్రవేశాల షెడ్యూల్ విడుదల చేయని ప్రభుత్వం



క్లాస్ రూంలో డిగ్రీ విద్యార్థులు

వేటపాలెం: ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు డిగ్రీలో తమకు నచ్చిన గ్రూపులో చేరడానికి ఎదురు చూస్తున్నారు. ఫలితాలు వెలువడి నాలుగు నెలలు గడుస్తున్నా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలపై కూటమి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం ప్రకటించలేదు. అడ్మిషన్లకు ఎలాంటి నోటిఫికేషన్ జారీ చేయలేదు. గత ఏడాది మాదిరిగా ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్ లైన్‌లో చేపడతారో లేదో తెలియని పరిస్థితి.

కోర్సుల కన్వర్షన్ కోసం

ఇంటర్ ఫలితాలు వచ్చిన తరువాత ప్రభుత్వం రాష్ట్రంలోని డిగ్రీ విద్యలో సింగిల్ మేజర్ విధానం లో తీసుకొచ్చిన మార్పులకు అనుగుణంగా కళాశా లలు కోర్సులు కన్వర్షన్ చేసుకోవాలని ఉన్నత విద్యా మండలి మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ కోర్సుల కన్వర్షన్ పూర్తయితే గాని డిగ్రీ ప్రవేశా లకు ప్రభుత్వ షెడ్యూలు విడుదల చేసే అవకాశం ఉందని కళాశాల అధ్యాపకులు చెబుతున్నారు.

గత ఏడాదీ ఆలస్యమే..

గత ఏడాది కూడా ఆలస్యంగా అడ్మిషన్లు చేపట్టడం తో చాలా కళాశాలల్లో సీట్లు మిగిలిపోయాయి. ఈ ఏడాది ప్రక్రియ మరింత ఆలస్యం జరిగే అవకాశం ఉంది. దీంతో కళాశాలల్లో అడ్మిషన్లు కూడా తగ్గు తాయని భావిస్తున్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాల్సిన కూటమి సర్కార్ వాటిని నిర్వీర్యం చేసే దిశగా అడు గులు వేస్తుందనే విమర్శలు వినబడుతున్నాయి.

ప్రభుత్వ కళాశాల్లో పరిస్థితి ఇదీ..

ఇంటర్ ఫలితాలు ఏప్రిల్ 12న విడుదలై నెలలు గడుస్తున్నా డిగ్రీ ప్రవేశాలపై నోటిఫికేషన్ విడుదల చేయలేదు. జూన్‌లోనే పాఠశాలలు, జూనియర్ కళా శాలలు ప్రారంభం చేసి తరగతులను నిర్వహిస్తు న్నారు. డిగ్రీ కళాశాలల్లో కూడా 2025–26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లను చేపట్టి తరగతులను ప్రారంభించాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు ప్రభుత్వం అడ్మిషన్ల ప్రక్రియపై సరైన స్పష్టత ఇవ్వ లేదు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మూడు నెలల నుంచి డిగ్రీ ప్రవే శాల కోసం విద్యార్థులు ఎదురు చూపులు చూస్తున్నారు. అడ్మిషన్లు ఆలస్యమవుతుండటంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ కళాశాలు ఫలితాల్లో వెనుకబడి పోతు న్నాయి. సమయానికి అడ్మిషన్లు జరగక, కోరుకున్న కళాశాల్లో కావాల్సిన గ్రూపులు అందుబాటులో లేక విద్యార్థులు నిరుత్సాహానికి గురవుతున్నారు.

నియోజవర్గంలో 2 వేల మంది

చీరాల నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ డిగ్రీ కళా శాల, ఎయిడెడ్ కళాశాల, మూడు ప్రైవేట్ కళాశాల లున్నాయి. వివిధ గ్రూపుల్లో దాదాపు 2 వేల మం ది విద్య అభ్యసిస్తున్నారు. ఇటీవల ఇంటర్ ఫలితాల్లో మూడు వేల మందికిపైగా ఉత్తీర్ణత సాధించారు. అందులో రెండు వేల మందికి పైగా డిగ్రీ ప్రవేశాల కోసం ఎదురు చూసుస్తున్నారు. ఒక నియోజకవర్గంలోనే ఇంత మంది ఉంటే జిల్లాలో ఇంకెంత మంది ఉంటారో అర్థం చేసుకోవచ్చు.

ఎదురు చూస్తున్నాం: నజ్మా, విద్యార్థి

డిగ్రీలో చేరడానికి ప్రభుత్వ నోటిఫికేషన్ విడు దల చేయలేదు. ఎప్పుడు విడుదలవుతుందా అని ఎదురు చూస్తున్నాను. ఇంటర్ ఫలితాలు వచ్చి మూడు నెలలు కావస్తోంది. ఎక్కడ చేరాలో ఏమి చేయాలో తెలియక అయోమయంగా ఉం ది. ప్రవేశాలపై ప్రభుత్వం సరైన స్పష్టత ఇవ్వడం లేదు. ఆన్‌లైన్లో, ఆఫ్‌లైన్లో తీసుకుం టారో తెలియని పరిస్థితి.

టేక్.. డైవర్షన్..

శంకర్‌విలాస్ ఓవర్‌బ్రిడ్జి కూల్చివేత నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): దశాబ్దాల చరిత్ర ఉన్న గుంటూరులోని శంకర్‌విలాస్ ఓవర్ బ్రిడ్జి కూల్చివేత పనులు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో పోలీసులు ట్రాఫిక్ మళ్లింపు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం నుంచి ట్రాఫిక్ రద్దీ భారీగా ఉండే అవకాశం ఉంది. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్ ఆదేశాలు మేరకు ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన డైవర్షన్లు ప్రతి ఒక్కరూ పాటించాల్సిన అవసరం ఉంది.

వెస్ట్ వైపు నుంచి రాకపోకలు ఇలా....

- అమరావతి రోడ్డు నుంచి మున్సిపల్ ట్రావెలర్స్ బంగ్లా (ఎంటీబీ) సెంటర్ వైపు వెళ్ళే వాహనాలు చిల్లీస్ పాయింట్ నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు మార్గంలో ప్రయాణించాలి.
- లాడ్జిసెంటర్ నుంచి ఎంటీబీ సెంటర్‌కు వెళ్ళే కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు అరండల్‌పే ట, పొట్టి శ్రీరాములు నగర్, డొంకరోడ్డు, మూడు వంతెనలు, లేని పక్షంలో బ్రాడీపేట, కం కరగుంట ఫ్లైఓవర్, మార్గంలో అటు, ఇటు ప్రయాణించాల్సిన అవసరం ఉంది.
- హిందూ కళాశాల కూడలి నుంచి లాడ్జి సెంటర్ వైపు వచ్చే వాహనాలు (స్కూల్ బస్సులతో సహా) రమేష్ హాస్పటల్, కంకరగుంట బ్రిడ్జి మార్గాన్ని వినియోగించుకోవాలి.
- కొబాల్డుపేట, కృష్ణనగర్, చంద్రమౌళీనగర్, బృం దావన్‌గార్డెన్స్, లక్ష్మీపురం, ప్రాంతాల నుంచి మార్కెట్ వచ్చే వాహనాలు, బ్రాడీపేట 18వ అడ్డరోడ్డు, కంకరగుంట అండర్‌పాస్, జిల్లా కలెక్టర్ కార్యాలయం, రమేష్ ఆసుపత్రి మీదుగా చేరుకోవాలి.
- పట్టాభిపురం నుంచి జీజీహెచ్‌కు వెళ్ళే వారు కం కరగుంట బ్రిడ్జి, ఎంటీబీ సెంటర్, ఉమెన్స్ కళా శాల రోడ్డు, పల్లవి థియేటర్ రోడ్డులో ప్రయాణించాలి.
- లాడ్జిసెంటర్– ఎంటీబీ సెంటర్ వైపు వెళ్ళే హెవీ వెహికల్స్ చిల్లీస్, ఇన్నర్‌రింగ్‌రోడ్డు, ఆటోనగర్, బస్టాండ్, కంకరగుంట బ్రిడ్జి మీదుగా వెళ్ళాలి.



సూచనలు చేస్తున్న ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్

గుంటూరు ఈస్ట్ నుంచి ఇలా..

- ఓల్డ్ క్లబ్ రోడ్డు, రామిరెడ్డితోట, నెహ్రూనగర్, బుచ్చయ్యతోట, మణిపురం ప్రాంతాలకు చెందిన ప్రజలు మూడు వంతెనలు మీదుగా డొంకరోడ్డు వైపు నుంచి శ్రీనగర్ మీదుగా అమరావతిరోడ్డు చేరుకోవాలి.
- క్లాత్‌బజారు, రైలుపేట, సాంబశివరావుపేట, నాజ్‌సెంటర్ చుట్టుపక్కల వారు భాస్కర్ డీలక్స్, మూడు వంతెనల మీదుగా గుం టూరు వెస్ట్‌లోకి వెళ్ళాలి.
- ఉమెన్స్ కాలేజి, విజ్ఞాన మందిరం సెంటర్, మార్కెట్ ప్రాంతాల వారు రైల్వేస్టేషన్ రోడ్డు మీదుగా జిల్లా కోర్టు వైపు నుంచి కంకరగుం ట బ్రిడ్జి మీదుగా రాకపోకలు సాగించవచ్చు.
- ఆర్టీసీ బస్టాండ్, పాతగుంటూరు , లాలాపేట, పట్నంబజారు, పరిసర ప్రాంతాల వారు హిందూ కళాశాల కూడలి మీదుగా మూడు బొమ్మల సెంటర్, పట్టాభిపురం వైపు ప్రాం తాలకు వెళ్ళవచ్చు.
- మంగళగిరి రోడ్డు, కాకాని రోడ్డు, మంగళదా స్‌నగర్ ప్రాంతాల వారు ఇన్నర్ రింగ్ రోడ్డు మీదుగా అమరావతి రోడ్డుకు చేరుకోవాలి.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి

జె.పంగులూరు: రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యా యుడు మృతి చెందిన సంఘటన మండల పరి ధిలోని అలవలపాడు క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం జరిగింది. రేణింగవరం పోలీసులు అందించిన వివ రాల మేరకు.. ఇంకొల్లు మండలం హనుమోజీ పాలేనికి చెందిన అత్తులూరి ధనుంజయరావు (45) భార్య మహోన్నతితో కలిసి గ్రామం నుంచి మోటార్ సైకిల్‌పై కొరిశపాడు మండలం బొ డ్డువాని పాలెం గ్రామంలో బంధువుల వివాహ వేడుకకు హాజరయ్యారు. తిరిగి జాతీయ రహదారి వెంబడి హనుమోజిపాలెం బయలు దేరారు. అలవ లపాడు వద్ద క్రాస్ రోడ్డు దాటుతుండగా, గుం టూరు నుంచి ఒంగోలు వైపు వెళుతున్న కారు ఢీకొ ట్టడంతో బైక్‌పై వెళు తున్న దంపతులు కింద పడ్డారు. తీవ్రగాయాల పాలైన ధనుంజయరావు అక్కడికక్కడే మృతి చెం దగా, భార్యకు గాయలు కాగా ఒంగోలు వైద్యశా లకు తరలించారు. మృ తుడు చీరాల మండలం ఈపురుపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునికి పనిచేస్తున్నారు. సం ఘటనపై ఎస్సై వినోద్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.



ధనుంజయరావు మృతదేహం

క్లుప్తంగా

లైవ్‌స్టాక్ యూనియన్ రాష్ట్ర కోశాధికారిగా అనిల్‌కుమార్



గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ లైవ్ స్టాక్ అసిస్టెంట్ సరీ్వస్ అసోసియేషన్ అమరావతి రాష్ట్ర కోశాధికారిగా గుంటూరుకు చెందిన చప్పిడి అనిల్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర కోశాధికారిగా ఎన్నికై న అనిల్‌కుమార్‌ను నాన్‌గెజిటెడ్ వెటర్నరీ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ సేవానాయక్, జిల్లా చైర్మన్ రాజమోహన్, ఏపీఎన్‌జీజీఓ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, జిల్లా సెక్రటరీ శ్యామ్ సుందర శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ షేక్ నాగూర్ షరీఫ్, నగర అధ్యక్ష కార్యదర్శులు సూరి, కళ్యాణ్, ఇతర సంఘ నేతలు అభినందనలు తెలిపారు.

పశ్చిమ డెల్టాకు 6,908 క్యూసెక్కులు విడుదల



దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి ఆదివారం 6,908 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్‌కు 290, బ్యాంక్ కెనాల్‌కు 1,820, తూర్పు కాలువకు 664, పశ్చిమకాలువకు 285, నిజాంపట్నం కాలువకు 460, కొమ్మూరు కాలువకు 3,060 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యారేజి నుంచి సముద్రంలోకి 50,750 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

అత్తపై కోడలి దాడి

యద్దనపూడి: అత్తపై కోడలు ఆమె తల్లి దాడి చేసిన ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై రత్నకుమారి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని పూనూరు ఎస్సీ కాలనీకి చెందిన బేతపూడి ఆదెమ్మ మనుమడు 15 రోజుల కిందట అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ నేపథ్యంలో బాలుడు తండ్రి.. ఆదెమ్మ కుమారుడు అయిన శ్రీను మనస్తాపంతో నిత్యం మద్యం తాగుతూ ఉండటంతో తల్లి ఆదెమ్మ.. కుమారునికి రోజూ అన్నం పంపిస్తోంది. తన భర్త నిత్యం మద్యం తాగుతూ తిరుగుతూ ఉంటే కుటుంబం ఎలా జరుగుతుందని శనివారం ఉదయం 11 గంటల సమయంలో కోడలు మాధవి అత్తపై వాగ్వాదానికి దిగింది. ఈ నేపథ్యంలో కోడలు, ఆమె తల్లి కాకాని మరియమ్మ ఇరువురు కలిసి ఆదెమ్మపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఆదెమ్మ తలకు తీవ్ర గాయం కాగా ఆసుపత్రి నుంచి వచ్చిన నివేదిక మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చంద్రన్న బీమా... కనిపించని ధీమా!

- ఇప్పటికీ తెరుచుకోని వెబ్‌సైట్
- ఏడాది గడిచినా దరఖాస్తులు స్వీకరించని కూటమి ప్రభుత్వం
- గత ప్రభుత్వంలో వైఎస్సార్ బీమాతో పేదలకు ఆసరా



బాపట్ల అర్బన్: గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది పాలన గడిచిపోయిన హామీలను మాత్రం నెరవేర్చలేక పోతుంది. పథకాలకు కేవలం పేర్లు మార్పు చేసి మిన్నకుండిపోయింది. కనీసం కుటుంబంలో చనిపోయిన వారికి ఇస్తామన్న చంద్రన్న బీమా పథకాన్ని కూడా అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుండడంతో కుటుంబ పెద్దను కోల్పోయిన పేద కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి.

పేరు మార్పుతో సరి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ బీమాను చంద్రన్న బీమాగా పేరు మార్చి సరిపెట్టుకున్నారు. ఇప్పటి వరకు పథకం విధివిధానాలను ప్రకటించలేదు. సహజ మరణానికి ఐదు లక్షలు, ప్రమాదవశాత్తు మృతి చెందితే బాధిత కుటుంబాలకు రూ. 10 లక్షలు అందిస్తామని ఎన్నికల ప్రచారంలో ప్రజలకు హామీ ఇచ్చారు. అధికారం చేపట్టి ఏడాది పూర్తి చేసుకొని సంబరాలు చేసుకున్నారే తప్ప బీమా పథకం అమలుపై దృష్టి పెట్టలేదని ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రారంభం కానీ వెబ్‌సైట్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ బీమా పథకానికి సంబంధించిన వెబ్‌సైట్‌ను తొలగించింది అప్పటి నుంచి చంద్రన్న బీమా పథకంగా పేరు మార్చిన వెబ్‌సైట్‌ను ప్రారంభించలేదు. మృతుల కుటుంబాల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు మార్గదర్శకత్వం కూడా విడుదల చేయలేదు. బీమా దరఖాస్తులు స్వీకరించేందుకు మార్గదర్శకాలు లేవని సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు. కుటుంబ యజమానిని కోల్పోయిన వారు బీమా సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

బీమా పథకం అమలు చేయాలి



ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు బీమా పథకం అమలు చేయాలి. యజమానిని కోల్పోయిన కుటుంబాలకు తక్షణమే బీమా సొమ్మును మంజూరు చేయాలి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మృతుల కుటుంబాలకు బీమా సొమ్ము ఖాతాలోకి జమ చేసి ప్రజలకు అండగా ఉండేది.

– ఆట్ల ప్రసాదరెడ్డి, అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇలా...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పేద, బడుగు, బలహీనవర్గాలకు చెందిన కుటుంబాలలో 18 నుంచి 50 సంవత్సరాలలోపు, 50 నుంచి 60 సంవత్సరాలలోపు వయస్సు వారు మృతి చెందితే రూ.లక్ష నుంచి రూ.ఐదు లక్షల వరకు వైఎస్సార్ బీమా మంజూరయ్యేది. మృతి చెందిన వెంటనే వలంటీర్లు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది మృతుల ఇంటికి వెళ్లి అంత్యక్రియల కోసం తక్షణ సాయంగా రూ.10000 అందించేవారు. మిగతా సొమ్ము 15 నుంచి 20 రోజుల్లో నామిని బ్యాంక్ ఖాతాలో జమ అయ్యేది. ఈ బీమా ప్రీమియాన్ని కూడా ప్రభుత్వమే చెల్లించేది.

జాతీయస్థాయి పోటీలకు బాపట్ల స్విమ్మర్ల ఎంపిక

- రాష్ట్రం నుంచి ఎంపికైన ఇద్దరూ బాపట్ల వాసులే
- 13నుంచి గుజరాత్‌లో జరగనున్న జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలు



జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన డోనాల్డ్‌వెంకట్, ఖాజా మోహిద్దీన్‌లు

బాపట్లటౌన్: జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు బాపట్ల ప్రాంతానికి చెందిన ఇద్దరు స్విమ్మర్లు ఎంపికయ్యారు. ఈనెల 13 నుంచి 17వ తేదీ వరకు గుజరాత్‌లోని నారన్పూర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 78వ సీనియర్ నేషనల్ అక్వాటిక్ చాంపియన్ షిప్–2025 (స్విమ్మింగ్)పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు ఏపీ రాష్ట్రం తరపున ఎంపికై న ఇద్దరు బాపట్ల నియోజకవర్గానికి చెందిన వారే కావడం విశేషం. వీరిలో బాపట్ల పట్టణానికి చెందిన ఉప్పాల డోనాల్డ్ వెంకట్ గౌడ్ కాగా, మరొకరు పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామానికి చెందిన షేక్ ఖాజా మోహిద్దీన్‌లు ఎంపికయ్యారు. వీరి ఇరువురు గతంలో అనేకమార్లు జాతీయస్థాయి ఈత పోటీల్లో పాల్గొని పలు అవార్డులు అందుకున్నారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి



జె.పంగులూరు: మండలంలోని రేణింగవరం పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పర్వతరెడ్డి వెంకటస్వామి (52) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. వెంకటస్వామి రేణింగవరం పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. అతని స్వగ్రామం చిన్నగంజాం మండలం సోపిరాల. ఆయన అస్వస్థతకు గురికావడంతో ఒంగోలు కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వెంకటస్వామికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారివురికి వివాహం చేశాడు. వెంకటస్వామి భౌతికకాయాన్ని రేణింగవరం ఎస్సై వినోద్ బాబు, సిబ్బంది సందర్శించి నివాళులర్పించారు.

నకిలీ విత్తన విక్రయదారులపై చర్యలు తీసుకుంటాం

మార్టూరు: నకిలీ విత్తనాల వలన నష్టపోయిన రైతుల భూములు పరిశీలించి వాస్తవాలు తెలుసుకొని నిజమైన పక్షంలో సంబంధిత విక్రయదారులపై తగు చర్యలు తీసుకుంటామని మార్టూరు వ్యవసాయాధికారి రామినేని లావణ్య అన్నారు. మార్టూరులో కొనుగోలు చేసిన గుమ్మడి విత్తనాలు నాటి మొలకెత్తక నష్టపోయిన బొల్లాపల్లికి చెందిన రైతు వీరవల్లి శ్రీనివాసరావు ఫిర్యాదుపై మార్టూరుకు చెందిన శ్రీలక్ష్మి వెంకటేశ్వర సీడ్స్ యజమానిని బాధిత రైతు భూమిని పరిశీలించడం కోసం ఆదివారం బొల్లాపల్లి రమ్మని పిలిచామని అయితే ఆదివారం తాను అందుబాటులో ఉండనని డీలర్ చెప్పినట్లు ఆమె తెలిపారు. సోమవారం ఉద్యాన శాఖ అధికారి హనుమంత్ నాయక్ తాను విత్తన విక్రయదారునితో కలిసి బొల్లాపల్లి వెళ్లి రైతు శ్రీనివాసరావు పంటను పరిశీలించనున్నట్లు తెలిపారు. షాపులోని గుమ్మడి విత్తనాలను సేకరించి జెర్మినేషన్ కోసం ఉన్నతాధికారులకు పంపించి నివేదిక వచ్చిన అనంతరం తగు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు ఏ డీలర్ అయినా నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని.. రైతులు ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

మొక్కజొన్న వ్యాపారిని మోసం చేసిన తండ్రీకొడుకులు

తెనాలిరూరల్: మొక్కజొన్న, జొన్నల వ్యాపారం చేసే తండ్రీకొడుకులు నంద్యాలకు చెందిన వ్యాపారిని మోసం చేయడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ చెంచుపేటకు చెందిన గోగినేని సత్యనారాయణ, అతని కొడుకు శ్రీకాంత్ మొక్కజొన్న, జొన్నల వ్యాపారాలు చేస్తుంటారు. నంద్యాలకు చెందిన వ్యాపారి శ్రీనివాస్ వద్ద రూ.20 లక్షలు తీసుకుని సరుకు ఇవ్వకుండా మోసం చేశారు. దీనిపై బాధితుడు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ ఎస్ఐ కరిముల్లా తెలిపారు

పోరాటానికి, క్రమశిక్షణకు మారుపేరు యూటీఎఫ్

యూటీఎఫ్ సీనియర్ నాయకుడు జోజయ్య



విప్లవ నినాదాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, సంఘ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: పోరాటానికి, క్రమశిక్షణకు యూటీఎఫ్ మారుపేరుగా నిలిచిందని యూటీఎఫ్ సీనియర్ నాయకుడు కె.జోజయ్య అన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సంఘ 52వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొని యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించిన జోజయ్య మాట్లాడుతూ యూటీఎఫ్ నిజాయతీకి, త్యాగానికి నిలయం అన్నారు. ఆవిర్భావం మొదలు క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని, సంఘాన్ని బలోపేతం చేసుకోవడంతో పాటు, పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

- మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ సంస్కరణల రూపకల్పనలో అకడమిక్ అంశాలతో పాటు, ఉపాధ్యాయుల కృషి, సమాజ భాగస్వామ్యంలో రావలసిన మార్పులపై దృష్టి పెట్టాలని అన్నారు.
- మరో సీనియర్ నాయకుడు జి.ప్రభుదాస్ చెన్నుపాటి విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడుతూ యూటీఎఫ్‌లో పని చేయడం ఎంతో గర్వకారణమన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కార్యకర్తల్లో ఆ స్ఫూర్తి ఉంటుందన్నారు.

కార్యక్రమంలో సంఘ జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, సీపీఎస్ కన్వీనర్ సీహెచ్ ఆదినారాయణ, జిల్లా కార్యదర్శులు ఎండీ షకీలా బేగం, కె.రంగారావు, బి. ప్రసాదు ఆడిట్ కమిటీ సభ్యులు కె.ప్రేమ్ కుమార్ రాష్ట్ర కౌన్సిలర్ బి.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తెనాలి మీదుగా వెళ్లే పలు రైళ్లు రద్దు

మరికొన్ని దారి మళ్లింపు

తెనాలిరూరల్: విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో కృష్ణా కెనాల్ నుంచి గూడూరు వరకు మూడో రైల్వేలైన్ నిర్మాణ పనులు జరుగుతుండడంతో పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తెనాలి రైల్వే స్టేషన్ మీదుగా నడిచే ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయడంతోపాటు కొన్ని రైళ్లను దారి మళ్లించారు. ఈ నెలాఖరు వరకు ఈ మార్పులు అమల్లో ఉంటాయని, ప్రయాణికులు గమనించాలని తెనాలి రైల్వే స్టేషన్ మేనేజర్ టీవీ రమణ సూచించారు. 19వ తేదీ వరకు విజయవాడ నుంచి తెనాలి మీదుగా ఒంగోలు, గూడూరు వెళ్లే అన్ని ప్యాసింజర్ రైళ్లు రద్దు చేశారు. ఈనెల 24వ తేదీ వరకు గుంటూరు నుంచి తెనాలి మీదుగా రేపల్లె వెళ్లే అన్ని ప్యాసింజర్ రైళ్లు రద్దు చేశారు. ఈ నెల 11వ తేదీ నుంచి 19వ తేదీ వరకు రేపల్లె–సికింద్రాబాద్ మధ్య నడిచే డెల్టా ఎక్స్‌ప్రెస్ రైళ్లు గుంటూరు వరకు మాత్రమే నడుస్తాయి. 19వ తేదీ వరకు విశాఖపట్నం నుంచి లింగంపల్లి మధ్య తెనాలి మీదుగా నడిచే రెండు రైళ్లు నేరుగా గుంటూరు నుంచి విజయవాడకు వెళ్తాయని, తెనాలి వైపు రావని తెలిపారు.

రద్దు చేసిన మరికొన్ని రైళ్లు

- తిరుపతి–ఆదిలాబాద్ రైలు (17405/17406) ఆగస్టు 13 నుంచి 20 వరకు రద్దు.
- తిరుపతి–విశాఖపట్నం రైలు (22707/22708) ఆగస్టు 13 నుంచి18 వరకు రద్దు.
- తిరుపతి–నర్సాపూర్ (07131/07132) రైలు ఆగస్టు 17, 18 తేదీల్లో రద్దు
- విజయవాడ–గూడూరు (67225/67226) రైలు ఈ నెల 6 నుంచి 24 వరకు రద్దు
- గూడూరు–సికింద్రాబాద్ (12709/12710) రైలు ఈ నెల 14, 17, 18 తేదీల్లో రద్దు
- తిరుపతి–లింగంపల్లి (12733/12744) రైలు ఆగస్టు 17, 18, 19 తేదీల్లో రద్దు
- విజయవాడ–గూడూరు (12743/12744) ఆగస్టు 11వ తేదీ నుంచి 20 వరకు రద్దు
- నర్సాపూర్–ధర్మవరం (17247/17248) రైలు ఆగస్టు 11 నుంచి 19 వరకు రద్దు
- రేణిగుంట–కాకినాడ టౌన్ రైలు (17249/17250) ఆగస్టు 12 నుంచి19 వరకు రద్దు

దారి మళ్లించిన రైళ్లు

రేణిగుంట–నిజాముద్దీన్ (00761) రైలు ఈనెల 25, 26, 28 తేదీల్లో వయా కృష్ణాకెనాల్, న్యూ గుంటూరు, తెనాలి మీదుగా వెళుతుంది. హౌరా–తిరుపతి (20889) రైలు, పూరి–తిరుపతి (22859) రైలు ఈనెల 26న, సంత్రాగచి–తిరుపతి (22855) రైలు ఈ నెల 27న, తిరుపతి–భువనేశ్వర్ (22872) రైలు ఈ నెల 28న వయా కృష్ణాకెనాల్, న్యూ గుంటూరు, తెనాలి మీదుగా దారి మళ్లిస్తారు.

దైవ దర్శనానికి వెళ్తుండగా ప్రమాదం

నలుగురికి తీవ్ర గాయాలు



బాధితులను 108 ద్వారా వైద్యశాలకు తరలిస్తున్న దృశ్యం

భట్టిప్రోలు: కృష్ణా జిల్లా పామర్రు సమీపంలో ఆదివారం జరిగే సంబరాలకు వెళుతుండగా వాహనం ప్రమాదానికి గురై నలుగురికి గాయాలయ్యాయి. భట్టిప్రోలు మండలం కోనేటిపురం గ్రామానికి చెందిన కొంత మంది కృష్ణాజిల్లా పామర్రు సమీప గ్రామంలోని అమ్మవారికి పసుపు, కుంకుమలు చెల్లించడానికి వాహనంలో బయలుదేరారు. వాహనం వేమవరం వంతెన వద్ద మలుపు తిరుగుతుండగా వెనుక వైపు డోర్ ఒక్కసారిగా ఊడిపోయింది. దీంతో వెనుక వైపు డోర్‌పైన కూర్చున్న నలుగురు కింద పడిపోయారు. బాధితులు గుర్రం శ్రీనివాసరావు, మోర్ల వెంకయ్య, జొన్నా రత్తయ్య, వెంకటేశ్వరరావులను భట్టిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్దకు తీసుకురాగా సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం తెనాలి ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఉచిత వైద్య సేవలు అభినందనీయం

ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుమతి జగడం



రోగులకు హెల్త్‌కార్డులు అందజేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుమతి జగడం

చీరాల రూరల్: వైద్యం ఖరీదైన ప్రస్తుత పరిస్థితుల్లో నిరుపేదలకు ఉచితంగా వైద్య సేవలందించి వారిపట్ల జాలిచూపడం ఎంతో మంచి పరిణామమని ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుమతి జగడం అన్నారు. పేరాల శాంతినగర్‌లో ఉన్నం సంగీతరావు జ్ఞాపకార్థం ఆయన మనుమరాలు డాక్టర్ షెర్లి ఫ్లారెన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుమతి జగడం ప్రారంభించారు. న్యాయమూర్తి చేతుల మీదుగా హెల్త్‌కార్డులు అందించారు. నిరుపేదల కోసం ఉచితంగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలందించడం మంచి పరిణామమని న్యాయమూర్తి నిర్వాహకులను అభినందించారు. తమ తండ్రి జ్ఞాపకార్థం ప్రతిఏటా క్రమం తప్పకుండా పేదలకు ఉచిత వైద్యసేవలందిస్తామని నిర్వాహకులు ఉన్నం ప్రసాద్ బాబు, ఉన్నం కిరణ్ తెలిపారు.

400 వందల మంది రోగులకు వైద్యసేవలు

ఉదయం 8 గంటలకు ప్రారంభించిన ఈ ఉచిత వైద్య మెగా వైద్యశిబిరం సాయంత్రం వరకు కొనసాగింది. చీరాల, పరిసర ప్రాంతాలకు చెందిన 400 మంది రోగులు పాల్గొని వైద్య సేవలు పొందుకున్నారు. బీపీ, షుగర్, ఈసీజీ, కంటి పరీక్షలు నిర్వహించిన వైద్యులు వారికి ఉచితంగా మందులు అందజేశారు. ప్రసాద్ డయాగ్నోస్టిక్స్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో వైద్యులు డాక్టర్ ఉన్నం షెర్లి ఫ్లారెన్స్, డాక్టర్ జి.ఇవాంజలీన బ్లెస్సీ, డాక్టర్ పి.జ్యోత్స్న, డాక్టర్ ప్రమోదహరి, డాక్టర్ ఎ.కిషోర్‌బాబు, డాక్టర్ పుష్ప, డాక్టర్ కోలా శేఖర్ బాబు, డాక్టర్ సూర్యతేజ, వి. రాజా సిల్వన్, డాక్టర్ దీప్తి గ్రేస్ పాల్గొని వైద్యసేవలందించారు. కార్యక్రమంలో చీరాల కోర్టు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కాత్యాయని, ఉన్నం గ్లోరి ఫ్లారెన్స్, సరళాదేవి, ఉన్నం ప్రసాద్ బాబు, ఉన్నం కిరణ్ పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా టూటౌన్ సీఐ నాగభూషణం తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

రజక దివ్యాంగురాలిపై దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దివ్యాంగురాలు పాదిలి దేవిక



చీరాలలో సమావేశం అయిన ప్రజా సంఘాలు, రజక వర్కర్స్ అసోసియేషన్

- తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న బాధితురాలు
- కలెక్టర్, ఎస్పీలను కలవనున్న ప్రజాసంఘాలు, రజక వర్కర్స్ అసోసియేషన్ నాయకులు

పర్చూరు(చినగంజాం): దివ్యాంగురాలైన ఓ రజక యువతిపై కర్రలు, రాడ్లతో దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తీవ్ర గాయాలపాలైన ఆ యువతి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయమై కారంచేడు ఎస్ఐ ఖాదర్ బాషా, బంధువులు, ప్రత్యక్ష సాక్షుల సమాచారం మేరకు.. కారంచేడు గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ యార్లగడ్డ శ్రీకృష్ణ, సుజాతలు నివాసముంటున్న అదే ప్రాంతంలో రజక సామాజిక వర్గానికి చెందిన కుటుంబం నివాసముంటోంది. ఈనెల 8వ తేదీ ఉదయం సుజాత ఇంటి ముందు ముగ్గు వేస్తున్న సమయంలో ఆమెను చూసి నవ్వారనే సాకుతో రజక కుటుంబంతో వివాదానికి దిగారు. అంతేగాకుండా నగదు అప్పు తీసుకొని ఇవ్వలేదనే కోపంతో రజక కుటుంబానికి చెందిన కృష్ణకుమారి, కోటి రత్నం, సునీత, నాగేశ్వరరావులపై సుజాత ఆమె భర్త శ్రీకృష్ణలు దాడికి దిగారు. కర్రలతో దాడి చేసి వారిని తీవ్రంగా గాయపరచారు. అంతటితో ఆగక ఇనుపరాడ్లతో అదే కుంటుంబానికి చెందిన మూగ, చెవిటి యువతి పాదిలి దేవికపై అమానుషంగా దాడి చేసి తీవ్రంగా గాయపరచడమే కాకుండా కులం పేరుతో దూషించి అసభ్యంగా వ్యవహరించారు. ఆ సంఘటనలో దివ్యాంగురాలు స్పృహ కోల్పోగా చీరాల ఏరియా వైద్యశాలలో చేర్పించారు. ఆమెకు ఆస్పత్రిలో ఆక్సిజన్ అందించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడిందని సమాచారం. ఆస్పత్రి వైద్యులు అందించిన నివేదిక మేరకు కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు. దాంతోపాటు దాడికి పాల్పడిన శ్రీకృష్ణ కూడా రజక కుటుంబంపై ఫిర్యాదు చేయగా రెండు కేసులు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ ఖాదరబాషా తెలిపారు.

న్యాయం చేయాలి

రజక సామాజిక వర్గానికి చెందిన చెవిటి, మూగ యువతి పాదిలి దేవికపై అగ్రవర్ణాలకు చెందిన యార్లగడ్డ శ్రీకృష్ణ అతని భార్య దాడి చేసి గాయపరచిన సంఘటనకు సంబంధించి ప్రజాసంఘాలు, రజక వర్కర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తీవ్రంగా స్పందించారు. ఆదివారం రాత్రి చీరాల ఎన్జీఓ కార్యాలయంలో సమావేశమయ్యారు. రజక కుటుంబంపై దాడి చేసి మూగ, చెవిటి యువతి దేవికను రాడ్లతో కొట్టి తీవ్రంగా గాయపరచిన సంఘటనకు సంబధించి బాపట్ల జిల్లా కలెక్టర్‌ను, ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు పెద్దిడపు కొండయ్య, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు కంచర్ల చిట్టిబాబు, రాష్ట్ర చేనేత నేత మాచర్ల మోహనరావు, సీఐటీయూ నాయకులు పి. వసంతరావు, రజక కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.జనార్దన్, కొండవీటి శ్రీనివాసరావు, పాదిలి సూర్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ లీగ్ విజేతగా బాపట్ల జిల్లా జట్టు



విజేతగా నిలిచిన బాపట్ల జిల్లా జట్టు క్రీడాకారులు

చీరాల రూరల్: బాపట్ల జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్లమల జోన్ (బాపట్ల, ప్రకాశం, గుంటూరు, పల్నాడు) జిల్లాల సీనియర్ ఫుట్‌బాల్ లీగ్ పోటీల్లో బాపట్ల జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం ఉదయం చీరాల్లోని ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూలు క్రీడా మైదానంలో నల్లమల జోన్‌లోని నాలుగు జిల్లాలకు ఫుట్‌బాల్ లీగ్ పోటీలు నిర్వహించారు. అన్ని విభాగాల్లో అత్యుత్తమంగా రాణించిన బాపట్ల జిల్లా ఫుట్‌బాల్ జట్టు ప్రకాశం జిల్లా జట్టును ఫైనల్లో నిలువరించి విజేతగా నిలిచింది. దీంతో నిర్వాహకులు ఈనెల 16, 17 తేదీల్లో విశాఖపట్టణంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు బాపట్ల జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జాతీయస్థాయి పోటీలకు, సంతోష్ ట్రోఫీకి ఎంపిక చేస్తారని నల్లమల జోన్ కోఆర్డినేటర్ నూతలపాటి దేవదాసు తెలిపారు. జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు వి. విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో కోఆర్డినేటర్ ఎన్. దేవదాసు, సమ్మర్ ఫుట్‌బాల్ క్యాంప్ ఇన్‌చార్జ్ బి. ప్రేమయ్య, ఎన్. నరేష్, ఎస్. బాలశౌరి, ప్రసన్న, మున్సిపల్ కౌన్సిలర్ ఎస్. సత్యానందం పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి యువకుడు మృతి



చిలకా సాగర్ మృతదేహం

ముప్పాళ్ల: ఓ యువకుడు సరదాగా ఈతకు వెళ్లి మృత్యువాత పడ్డ సంఘటన మండల కేంద్రంలోని పెదనందిపాడు బ్రాంచి కాలువ వద్ద ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అచ్చంపేట మండలం వేల్పూరు గ్రామానికి చెందిన చిలకా సాగర్(25) అనే యువకుడు చిలకలూరిపేటలో ఆటో నడుపుతుంటాడు. తనకు మేనల్లుడు వరుసైన వడ్డవల్లి నరేంద్రకు మార్టూరులో డబ్బులు రావాల్సి ఉండగా ఇద్దరూ కలిసి అక్కడికి వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై వేల్పూరు బయలుదేరారు. మార్గమధ్యలో ముప్పాళ్లలోని పెదనందిపాడు బ్రాంచి కాలువ వద్దకు రాగానే నరేంద్ర పక్కనే ఉన్న దుకాణంలో టిఫిన్ చేసేందుకు వెళ్లగా, సాగర్ ఈత కొట్టేందుకు కాల్వలోకి దిగాడు. నీటి ఉధృతికి డ్రాపులో పడ్డాడు. గమనించిన స్థానికులు కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్థానికుల సాయంతో బయటకు తీశారు. నరేంద్ర ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.